సాక్షి
జగిత్యాల
మంగళవారం । 4 । జూన్ । 2024



లైవ్‌లో ఓట్ల లెక్కింపు
జగిత్యాల: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ‌ను లైవ్‌లో చూసేందుకు వీలుగా.. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయంలో స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ప్రజలు లైవ్‌లో తిలకించవచ్చని అధికారులు తెలిపారు.



రాజన్న దర్శనానికి నాలుగు గంటలు
వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.0/24.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమర్థవంతమైన విధుల ద్వారానే మంచి ఫలితాలు



డీఎస్పీకి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: సమర్థవంతమైన విధుల ద్వారానే మంచి ఫలితాలు సాధ్యమని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పోలీసు అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇదేస్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికల నిర్వహణలో కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ప్రశంసపత్రాలు అందించారు. అడిషనల్ ఎస్పీలు వినోద్‌కుమార్, భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్, వేణుగోపాల్, నర్సింహారెడ్డి, రవి, సురేశ్, నవీన్, ఆర్‌ఐలు జానిమియా, రామకృష్ణ, వేణు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్‌యాక్ట్ అమలు

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల నేపథ్యంలో ఈనెల 30 వరకు జిల్లావ్యాప్తంగా సిటీ పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు నిర్వహించరాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించొద్దని సూచించారు.

జిల్లాకు జీలుగ విత్తనాలు కేటాయింపు

జగిత్యాల: జిల్లాకు జీలుగ 14,300 క్వింటాళ్లు, జనుము 2,460 క్వింటాళ్లు కేటాయించినట్లు కలెక్టర్ యాస్మిన్‌బాషా తెలిపారు. సోమవారం సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇప్పటివరకు 9,554 క్వింటాళ్ల జీలుగ, 1290 క్వింటాళ్ల జనుము విత్తనాలను నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ వరంగల్ నుంచి తెప్పించి ఆగ్రో రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మరో 5 వేల క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. రైతులు అధైర్యపడొద్దని పేర్కొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరుతూ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఫసల్ బీమా అమలు చేయాలని కోరారు. బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో అనేక అవకతవకలు జరిగాయని, తాలు, తప్ప పేరుతో తీసిన తరుగు డబ్బులను రైతులకు చెల్లించాలని కోరారు. రూ.500బోనస్ చెల్లించాలన్నారు. సురకంటి నారాయణరెడ్డి, ముద్దం రాము, నరెడ్ల రవి, ఐలేటి రాజు, గంగారెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీఎల్టీ నంబర్ రద్దు

- భూకబ్జా యత్నంపై కొనసాగుతున్న విచారణ?

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని హస్నాబాద్ శివారు సర్వేనంబరు 1599లో ఉన్న భూమిని కబ్జాకు చేసుకునేందుకు కొందరు అక్రమ వీఎల్టీ సృష్టించారనే నేపథ్యంలో సదరు భూయజమానులు ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే జారీ చేసిన వీఎల్టీ నంబరు 2110105727 ద్వారా 4-4-325/1/ఎ ఇంటి నంబర్ ఇవ్వగా.. దానిని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ భూకబ్జా యత్నానికి పాల్పడిన దానిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లోతుగా విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతానికి వీఎల్టీ నంబర్‌ను రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు తెలిపారు.

గెలుపెవరిదో..

- నేడు పార్లమెంట్ ఓట్ల లెక్కింపు
- డిచ్‌పల్లిలో ఏర్పాట్లు పూర్తి
- జగిత్యాల, కోరుట్ల సెగ్మెంట్లకు 18 చొప్పున టేబుళ్లు
- మొత్తం 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- 558 మంది కౌంటింగ్ సిబ్బంది
- 180 మంది సూపర్‌వైజర్లు
- 190 మంది అసిస్టెంట్లు
- 188 మంది మైక్రో అబ్జర్వర్లు



డిచ్‌పల్లిలోని ఓట్ల లెక్కింపు కేంద్రం



డిచ్‌పల్లిలోని ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఏజెంట్ల చెకింగ్ పాయింట్

జగిత్యాల: నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోకి జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాలు వస్తాయి. అలాగే ధర్మపురి నియోజకవర్గం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోకి వెళ్తుంది. మే 13న పోలింగ్ అనంతరం జగిత్యాల, కోరుట్ల సెగ్మెంట్ల పరిధిలోని ఈవీఎంలను నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లిలోని కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. ఈ నియోజకవర్గాలకు 18టేబుళ్లు ఏర్పాటు చేసి 15 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. అలాగే ధర్మపురి సెగ్మెంట్ ఈవీఎంలను పెద్దపల్లిలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. దీనికి 18 టేబుళ్లు ఏర్పాటు చేసి 20 రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది.

మొదట పోస్టల్ సర్వీస్ ఓట్లు

ఓట్ల లెక్కింపులో మొదట పోస్టల్ సర్వీస్ ఓట్లు లెక్కిస్తారు. జగిత్యాలలో 1307, కోరుట్లలో 637, ధర్మపురిలో 834 మంది ఓటు వినియోగించుకున్నారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రతి నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి 18 టేబుళ్లలో 15 రౌండ్లలో లెక్కింపు చేపడతారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుళ్లలో 20 రౌండ్లలో లెక్కించనున్నారు. రౌండ్లవారీగా పోలింగ్ కేంద్రాల కంట్రోల్ యూనిట్లను తీసుకొచ్చి రిజల్ట్ మీటరు నొక్కి అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను నమోదు చేస్తారు. చివరగా 17ఏ ఫాంను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూస్తారు. మొత్తం టేబుళ్ల వారీగా వచ్చిన ఓట్లను రౌండ్లవారీగా చేసి ఫలితాలను ప్రకటిస్తారు.

టెన్షన్ టెన్షన్

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసి 20 రోజులైంది. అభ్యర్థులు ఇప్పటికే పోల్ మెనేజ్‌మెంట్‌ను తీసుకుని మెజార్టీలపై అంచనాలు వేసుకున్నారు. మంగళవారం ఓట్ల లెక్కించనున్న నేపథ్యంలో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఈ ఎన్నికల్లో ఎవరిని విజయం వరించనుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఈసారి నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి, బీజేపీ తరఫున సిట్టింగ్ ఎంపీ అర్వింద్, బీఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్దన్ పోటీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నుంచి పోటీచేసి ఓడిపోయిన జీవన్‌రెడ్డి.. ఈసారి జగిత్యాల నియోజకవర్గంలో మెజార్టీపై దృష్టి సారించారు. ముఖ్యంగా యువత, మహిళల ఓట్లపై ఆశలు పెట్టుకున్నారు. పెద్దపల్లి నుంచి మొన్నటివరకు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి, గడ్డం వంశీ కాంగ్రెస్ నుంచి, గోమాస శ్రీనివాస్ బీజేపీ నుంచి పోటీచేశారు. ఇక్కడ కొప్పుల ఈశ్వర్‌కు సొంత నియోజకవర్గం కావడంతో ఎంత మెజార్టీ వస్తుందోనని నాయకులు అంచనాలు వేసుకుంటున్నారు.



రూట్ మ్యాప్

రౌండ్ల వివరాలు

అసెంబ్లీ సెగ్మెంట్	మొత్తంఓట్లు	పోలైనవి	కేంద్రాలు	టేబుళ్లు	రౌండ్లు
కోరుట్ల	2,45,249	1,80,767	262	18	15
జగిత్యాల	2,36,675	1,74,842	254	18	15
ధర్మపురి(పెద్దపల్లి)	2,30,786	1,69,272	269	14	20
మొత్తం	7,12,710	5,24,881	785	50	50

పోస్టల్ ఓట్లు

అసెంబ్లీ సెగ్మెంట్	మొత్తం ఓట్లు	పోలైనవి
కోరుట్ల	689	637
జగిత్యాల	1492	1307
ధర్మపురి (పెద్దపల్లి)	946	834
మొత్తం	3127	2778

ఏజెంట్లు నిబంధనలు పాటించాలి

- కౌంటింగ్ సెంటర్‌కు ఐదు కిలోమీటర్ల పరిధిలో 144 సెక్షన్
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్: ఓట్ల లెక్కింపునకు వచ్చే వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు పక్కాగా నిబంధనలు పాటించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ సూచించారు. సీఎంసీ సెంటర్‌కు ఉదయం 6గంటల వరకే ఉండాలని, జారీ చేసిన గుర్తింపు కార్డుపై వారి ఫొటోను అతికించుకోవాలని, ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఏజెంట్ల ఫోన్‌లను కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించబోరని తెలిపారు. కేంద్రం లోపలికి ఎలక్ట్రానిక్, రికార్డింగ్ పరికరాలు, డిజిటల్ వాచీలు, సిగరెట్, బీడీ, అగ్గిపెట్టె, పదునైన వస్తువులు తీసుకెళ్లరాదన్నారు. ఆహారం, తాగునీరు తదితర సౌకర్యాలు కేంద్రం వద్ద అందుబాటులో ఉంటాయని, విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం, టపాసులు పేల్చడం, రాజకీయ నాయకులు/పార్టీ కార్యకర్తలు గుమిగూడడం వంటి చర్యలు సీఎంసీ కౌంటింగ్ సెంటర్‌కు ఐదు కిలోమీటర్ల పరిధిలో పూర్తిగా నిషేధమన్నారు. ఉదయం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం 25 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచామన్నారు.

జగిత్యాలకు చేరనున్న ఈవీఎంలు

- ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో భద్రత మధ్య ఈవీఎంలు



ఈవీఎంలను భద్రపరిచే ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల

జగిత్యాల: నిజామాబాద్‌పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు అనంతరం జగిత్యాల, కోరుట్ల, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ధర్మపురి నియోజకవర్గ ఈవీఎంలు జగిత్యాలకు రానున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం భారీ బందోబస్తు మధ్య జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలకు తీసుకురానున్నారు. ఇప్పటికే కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేశారు. గతంలో వీఆర్‌కే కళాశాలలో ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం ఆ కళాశాలలో వీలు లేకపోవడంతో ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాలలో ఉంచనున్నారు. 45రోజుల పాటు ఈవీఎంలను ఈ కళాశాలలో ఉంచిన అనంతరం అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు రాకపోతే ఈవీఎంలను గోదాంకు తరలిస్తారు. సీసీకెమెరాల మధ్య పకడ్బందీగా కళాశాలలో ఏర్పాట్లు చేశారు.

పాలిసెట్‌లో 84.30శాతం ఉత్తీర్ణత



కట్ట హితేశ్



కీర్తన వాసవి

జగిత్యాల/జగిత్యాలజోన్: ఇటీవల నిర్వహించిన పాలిసెట్‌లో జిల్లా విద్యార్థులు 84.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షకు 3,127 మంది హాజరుకాగా ఎంపీసీలో 2,636 మంది ఉత్తీర్ణత సాధించారు. గాంధీనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, రాధ దంపతుల కూతురు మారంపల్లి కీర్తనవాసవి బైపీసీలో రాష్ట్రంలో 14వ ర్యాంక్, ఎంపీసీలో 81వ ర్యాంక్ సాధించింది. అలాగే జగిత్యాల మండలంలోని మోరపల్లికి చెందిన రాజేందర్, జమున దంపతుల కుమారుడు కట్ట హితేశ్ బైపీసీలో నాలుగో ర్యాంక్, ఎంపీసీలో 14వ ర్యాంక్ సాధించాడు.

బండి, గంగులను కలిసిన మున్నూరుకాపులు



బండి సంజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాల: మున్నూరుకాపు జిల్లా కార్యవర్గం సోమవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను వారివారి నివాసాల్లో కలుసుకుంది. ఇటీవల జిల్లా అధ్యక్షుడిగా ఒడ్నాల రాజశేఖర్, కార్యదర్శిగా చిట్ల రమణ ఎన్నికైన విషయం తెల్సిందే. వారు ఎంపీని మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. ఎంపీ మాట్లాడుతూ.. కుల బాంధవులందరికీ తన సహాయ సహకారాలు ఉంటాయని, ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం నాయకులు గంగులను కలిసి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాచకొండ శ్రీరాములు, లైశెట్టి వెంకన్న, బండారు విజయ్, కూసరి అనిల్, నరేశ్, రమేశ్, మహేశ్, గంగారెడ్డి, జంగిలి కృష్ణకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నృసింహాలయంలో ఎమ్మెల్యేల పూజలు



స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందిస్తున్న విప్

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి నరసింహస్వామి ఆలయంలో పెద్దపల్లి, ధర్మపురి ఎమ్మెల్యేలు విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకోగా.. వేదపండితులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు. పార్టీ ధర్మపురి మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అబుదాబిలో ఆవిర్భావ వేడుకలు



అబుదాబిలో రాష్ట్ర గీతం పాడుతున్న చిన్నారులు

రాయికల్: అబుదాబిలో తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం మాత్రమే కాదని, అదొక స్ఫూర్తి అని, దాని మూలాలను భవిష్యత్‌తరాలకు చేరవేసే బాధ్యత ప్రతి ఒక్క తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. ఈనెల 9న దుబాయ్‌లోని స్పార్క్ మీడియా, తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యనిర్వాహక సభ్యులు పావనిశ్రీనివాస్, అర్చన, వంశీ, పద్మజ, గంగారెడ్డి, లత, గోపాల్, దీప్తి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

జగిత్యాల: మార్చిలో ఇంటర్ ప్రాక్టికల్స్‌కు హాజరుకాకుండా సప్లిమెంటరీకి ఫీజు చెల్లించిన విద్యార్థులకు ఈనెల నాలుగోతేదీ నుంచి ప్రాక్టికల్స్ ఉంటాయని ఇంటర్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 8.30గంటల నుంచి ఒక పరీక్ష, మధ్యాహ్నం 1.30 గంటలకు మరో పరీక్ష ఉంటుందని వివరించారు.

పేదల సంక్షేమానికి కేసీఆర్ కృషి




పతాకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

జగిత్యాల: పేదల సంక్షేమానికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు ఉత్సవాల్లో బాగంగా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలు ఇచ్చి మోసం చేసిందని, ఒక్క హామీ నెరవేర్చలేక చతికిలపడుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ గెలవడం ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయానికి మాజీ సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. పదేళ్లలో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రస్థానంలో ఉంచిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

‘ధరణి’ దరఖాస్తులకు మోక్షం

- పోర్టల్‌లో లాగిన్‌కు అవకాశం
- ఆర్డీవోలు, తహసీల్దార్లకు అనుమతి
- జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం



ధరణి వెబ్‌సైట్



కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు ఇస్తున్న ప్రజలు(ఫైల్)

జగిత్యాల: భూ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్‌లో నమోదు చేసుకుంటే కొన్ని ఆప్షన్లు లేక అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. అధికారులెవరికీ ఆప్షన్లు మార్చే అధికారం లేకపోవడంతో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్న విషయం తెల్సిందే. ఇలా జిల్లాలో వేలాది దరఖాస్తులు పేరుకుపోయాయి. తాజాగా కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ధరణి పోర్టల్‌పై ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు రెవెన్యూ డివిజన్లలో ఆర్డీవోలు, మండలాల్లో తహసీల్దార్లకు ధరణి పోర్టల్‌లో కొన్ని మార్పులుచేర్పులు చేసేందుకు ప్రభుత్వం కొన్ని ఆప్షన్లు ఇచ్చింది. వారు పోర్టల్‌లో లాగిన్ అయ్యే అవకాశం కల్పించింది. ఈ మేరకు ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ నిత్యం సమావేశాలు నిర్వహిస్తూ గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇది రైతుల్లో ఆనందానికి కారణమవుతోంది. ఇప్పటికే ధరణి మాడ్యుల్స్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ప్రజావాణికి అత్యధికంగా రెవెన్యూ సమస్యలే రావడంతో ప్రభుత్వం దానిపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేక కమిటీ వేసి సమస్యలు పరిష్కరించేలా చూడాలని పేర్కొనడంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి దరఖాస్తులు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికలు రావడంతో కొద్దిరోజులపాటు నిలిచిపోయాయి. ప్రస్తుతం మళ్లీ స్పెషల్ డ్రైవ్ పునఃప్రారంభించాలని ఆదేశాలు రావడంతో తహసీల్దార్లు పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆర్డీవో, తహసీల్దార్ల స్థాయిలో కొన్ని లాగిన్స్ ఇవ్వడంతో ఓపెన్ అవుతున్నాయి. తహసీల్దార్ స్థాయిలో ఆధార్ ఇన్‌కరెక్ట్, జెండర్, రెండు ఖాతాలు ఒకరికే ఉంటే విరాసత్, క్యాస్ట్ ఇలాంటి తప్పులను వారు సరిదిద్దే అవకాశం ఉంది. అలాగే ఆర్డీవో స్థాయిలో నాలా కన్వర్షన్, రూ.5 లక్షలలోపు మార్కెట్ వాల్యూ ఉండే మిస్సింగ్ సర్వేనంబర్లు, పాస్‌బుక్ రానివారి సమస్యలు పరిష్కరించనున్నారు.

వీడనున్న భూముల చిక్కుముడులు

గతంలో చేపట్టిన రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా జిల్లాలో చాలా వరకు భూముల సమస్యలు ఏర్పడ్డాయి. పాస్‌బుక్‌లు రాకపోవడం, మిస్సింగ్ సర్వేనంబర్లు, నిషేధిత భూములు జాబితాలో చేర్చడం ఇలా ఎన్నో సమస్యలు వచ్చాయి. గతంలో ధరణిని తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో ఏమీ చేయలేని పరిస్థితి ఉండేది. ఏదైనా దరఖాస్తు చేసుకుంటే నేరుగా కలెక్టర్‌కే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. ప్రస్తుతం అన్ని సమస్యలకు సంబంధించిన మాడ్యుల్స్‌ను ప్రభుత్వం ఇవ్వడంతో తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో కొన్ని సమస్యలు పరిష్కారం కానున్నాయి. ముఖ్యంగా ధరణిలో మిస్సింగ్ సర్వే నంబర్లు, ఒకరిపేరులో మరొకరి పేరు, పాస్‌బుక్‌లు రాకపోవడం, అక్షరదోషాలు, భూ విస్తీర్ణంలో తేడాలు వంటివి ఎక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పరిష్కారం అయ్యే అవకాశాలున్నాయి. ఎన్నికల కన్నా ముందు ఆర్డీవో, తహసీల్దార్లకు మాడ్యుల్స్ వచ్చినప్పటికీ లాగిన్స్ ఓపెన్ కాలేదు. ప్రస్తుతం ఆర్డీవో, తహసీల్దార్లకు సంబంధించి లాగిన్స్ ఓపెన్ అవుతున్నాయి. జిల్లాలో దాదాపు చిన్నచిన్న సమస్యలే మూడు వేలకుపైగా దరఖాస్తులు వచ్చి ఉంటాయని అంచనా వేస్తున్నారు. మండలాల వారీగా దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చేర్చుతున్నారు. మండలస్థాయిలో తహసీల్దార్, డివిజన్‌స్థాయిలో ఆర్డీవో లాగిన్స్ అవుతూ రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారు.

తొలగనున్న రైతుల ఇబ్బందులు

ధరణిపై ప్రభుత్వం జిల్లా, మండలస్థాయి అధికారులకు లాగిన్స్ ఇవ్వడంతో భూముల చిక్కుముడులు వీడనున్నాయి. గతంలో అనేక తప్పులు దొర్లడంతో రైతుబంధు రాక, రైతుబీమా అందక.. ఇలా ఎన్నో అవకాశాలను రైతులు కోల్పోయారు. ప్రభుత్వం ధరణి సరిచేస్తూ ప్రతి సమస్యకూ సంబంధించిన మాడ్యుల్స్ ఇవ్వడంతో కొన్ని బాధ్యతలను ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఇవ్వడంతో రైతుల సమస్యలు తొలగనున్నాయి. ఈ మేరకు మండలాలతో పాటు, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు ధరణిలో ఉన్న సమస్యలపై కసరత్తు చేస్తున్నారు.

వెంటనే పరిష్కరిస్తున్నాం



ఎన్నికల నేపథ్యంలో కొంత జాప్యం జరిగింది. ధరణి సమస్యలను వెంటవెంటనే పరిష్కరిస్తున్నాం. స్పెషల్ డ్రైవ్ పునఃప్రారంభించాం. జిల్లాలో ధరణిలో వచ్చిన దరఖాస్తులన్ని పరిష్కరిస్తాం.
– మధుసూదన్, ఆర్డీవో, జగిత్యాల

ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి



రైతులు భూ సమస్యలుంటే సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తహసీల్దార్ నుంచి ఆర్డీవో, జిల్లా కలెక్టర్ వరకు వరుస క్రమంలో చేరుకుంటాయి. – ఆనంద్‌కుమార్, ఆర్డీవో, కోరుట్ల

క్లుప్తంగా

పాల ట్యాంక్‌లో పడి.. అనంతలోకాలకు

- మృతుడు డెయిరీలో టెక్నికల్ ఆఫీసర్


ముజీబ్ మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదవశాత్తు పాల ట్యాంక్‌లో పడి, మృతిచెందాడు ఓ డెయిరీ టెక్నికల్ ఆఫీసర్. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణ జిల్లా నందిగామకు చెందిన షేక్ ముజీబ్(44) జమ్మికుంట మండలం వెంకటేశ్వరపల్లిలోని ఎస్ఆర్‌కే డెయిరీలో టెక్నికల్ ఆఫీ సర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోమవారం ఈటీపీ ట్యాంక్‌ను పరిశీలిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి, అందులోనే పడిపోయాడు. గమనించిన మేనేజర్, సిబ్బంది ఆయనను బయటకు తీసి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య షేక్ కరీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రవి పేర్కొన్నారు.

మృతదేహం అప్పగింత

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మద్యం మత్తులో కిందపడి మృతి చెందిన రాకేశ్(30) వివరాలను గుర్తించామని టౌన్ సీఐ రవి తెలిపారు. మృతదేహాన్ని సోమవారం అతని తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. రాకేశ్ మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బల్హార్షా వాసి అని పేర్కొన్నారు. మృతుడి తండ్రి నాగేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రెస్టారెంట్‌కు జరిమానా


తనిఖీ చేస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగర పాలక సంస్థ అధికారులు స్థానిక ఐబీ కాలనీలోని వైష్ణవి రెస్టారెంట్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. పాడైపోయిన చికెన్, గడువు తేదీ దాటిన పదార్థాలతో ఆహారం తయారు చేయడాన్ని గుర్తించారు. నిర్వాహకులకు రూ.10 వేల జరిమానా విధించారు. చట్ట ప్రకారం సదరు రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోవడానికి ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్, నాగభూషణం, సునీల్, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్, వైకుంఠం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మెయిల్ చేసిన రిపోర్టర్‌పై కేసు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ షాకీర్‌ను డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేసిన ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ గట్టిపెల్లి రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. షాకీర్‌పై ఓ వృద్ధుడు రెండు రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని తమ చానల్‌లో ప్రసారం చేయకుండా ఉండటానికి రూ.25 వేలు ఇవ్వాలని రాజశేఖర్ డిమాండ్ చేయగా, షాకీర్ రూ.5 వేలు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. అడిగిన మొత్తం ఇవ్వకపోవడంతో రాజశేఖర్ ఆ డబ్బులను తిరిగి ఆయనకు పంపించాడు. అనంతరం చానల్‌లో న్యూస్‌ను ప్రసారం చేయించాడు. దీంతో డబ్బుల కోసం తనను బ్లాక్ మెయిల్ చేయడమే కాకుండా అసత్యపు వార్తను ప్రసారం చేసి, తన పరువుకు భంగం కలిగించాడని షాకీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి అమ్మేందుకే కరీంనగర్ వచ్చారా?

- 70 కేజీల గంజాయితో దొరికిన ముగ్గురు జైలుకు..
- ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- ప్రధాన నిందితుడి కోసం ఆంధ్రా పోలీసుల గాలింపు
- అతన్ని కస్టడీలోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి?


గంజాయి, నిందితులను చూపుతున్న పోలీసులు (ఫైల్)

కరీంనగర్ క్రైం: యువత మత్తుకు బానిసవుతుండటంతో గంజాయి వ్యాపారం ఊపందుకుంటోంది. ఫలితంగా యువకులకు విక్రయించేందుకు గంజాయి మాఫియా వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. కరీంనగర్ జిల్లాకు ఒడిశా, విశాఖపట్నం, అరకు ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇటీవల కరీంనగర్ తీగల వంతెన వద్ద ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఇద్దరు, మహారాష్ట్రకు చెందిన ఒకరు 70 కేజీల గంజాయిని కారులో తరలిస్తుండగా వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. సీజ్ చేసి, వారిని కరీంనగర్ జైలుకు తరలించారు. ఈ గంజాయిని మహారాష్ట్రకు తరలించి, అక్కడ విడిగా విక్రయించేందుకు నిందితులు సిద్ధమైనట్లు సమాచారం.

ఒకరు కరడుగట్టిన నేరస్తుడు..

వివిధ రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా చేస్తున్న నిందితులు కరీంనగర్‌కు దిగుమతి చేస్తున్నారు. వీరు ఇదే పనిగా దందా కొనసాగిస్తున్నారు. గతంలో అరకు, విశాఖపట్నం, భద్రాద్రి కొత్తగూడెం, చత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి రవాణా చేస్తూ పలువురు పట్టుబడ్డారు. విచారణలో కరీంనగర్‌కు రైళ్లు, బస్సుల్లో తీసుకొచ్చి, ఇక్కడి కాలేజీ విద్యార్థులు, కార్మికులు, కూలీలను టార్గెట్‌గా చేసుకొని, అమ్మకాలు జరిపినట్లు తేలింది. తాజాగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా కరీంనగర్‌లో పట్టుబడిన వారిలో ఒకరు కరడుగట్టిన నేరస్తుడని, అతని కోసం ఆంధ్రా పోలీసులు కూడా కొన్ని రోజులుగా గాలిస్తున్నారని తెలిసింది. అయితే, ఆ వ్యక్తి పోలీసులు ఎంత విచారించినా నోరు మెదపకపోవడంతో జైలుకు తరలించారు. తిరిగి కస్టడీకి తీసుకుంటే మరింత సమాచారం వస్తుందని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. పట్టుబడిన ముగ్గురిలో ఇద్దరికి గతంలో నేరచరిత్ర ఉందని, ఒకరు మాత్రం తాజాగా గంజాయి రవాణాలో పాలుపంచుకుంటున్నట్లు గుర్తించారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలించే క్రమంలో కరీంనగర్‌లోనూ గంజాయి అమ్మేందుకే ఇటుగా వస్తున్నారా అని అనుమానిస్తున్నారు. గంజాయి పండించేవారు మొదలు కిందిస్థాయిలో దాన్ని సేవించేవారిని సైతం పట్టుకుంటేనే ఈ దందాకు అడ్డుకట్ట వేయవచ్చని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. గంజాయి పట్టుబడిన కేసులో ప్రధాన నిందితుడిని కస్టడీకి తీసుకుంటే ఇంకెలాంటి విషయాలు బయటకు వస్తాయో చూడాలి.

రాజన్న దర్శనానికి నాలుగు గంటలు



క్యూలైన్లలో భక్తులు, కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఈవో రామకృష్ణ కుటుంబసభ్యులు

- వేములవాడలో పోటెత్తిన భక్తులు
- క్యూలైన్లలో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

వేములవాడ: వేసవి సెలవులు దగ్గరపడుతుండడంతో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం దాదాపు 30 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఒక్కో భక్తుడికి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లు కిక్కిరిసి ఉండడంతో ఉక్కపోతతో భక్తులు ఇబ్బంది పడ్డారు. సోమవారం కావడంతో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మహానివేదన నిర్వహించగా.. ఈ సమయంలో దర్శనాలు నిలిపివేశారు. ప్రసాదాల కొనుగోలు వద్ద తోపులాట జరిగింది. స్వామి వారిని ఆలయ ఈవో రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో రామకృష్ణ, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

అంజన్న పెద్ద జయంతి ఆదాయం రూ.1.51 కోట్లు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న పెద్ద జయంతి సందర్భంగా ఆలయానికి భారీగా ఆదాయం సమకూరినట్లు అధికారులు సోమవారం తెలిపారు. గత నెల 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా రూ.1,51,38,490 వచ్చినట్లు పేర్కొన్నారు. అత్యధికంగా మాల విరమణ ద్వారా రూ.31 లక్షలు వచ్చాయన్నారు. గత కొన్నేళ్లలో ఎప్పుడూ లేనంతగా 48 గంటలపాటు భక్తుల రద్దీ కొనసాగిందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

- 24 గంటలైనా పోస్టుమార్టం చేయని వైనం
- పోలీసుల తీరుపై మృతుడి కుటుంబసభ్యుల ధర్నా


ఎల్లయ్య (ఫైల్)


ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని గోరింట్యాలకు చెందిన గొల్లపల్లి ఎల్లయ్య(65) ఆదివారం ఉదయం గ్రామంలోనే సైకిల్‌పై వెళ్తుండగా.. కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందాడు. అయితే, చనిపోయి 24 గంటలు దాటినా అక్కడ పోస్టుమార్టం చేయించడంలో స్థానిక పోలీ సులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు సోమవా రం గోరింట్యాలలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఎల్లయ్య మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని త్వరగా అప్పగించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని, గాంధీ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తామని, న్యాయం జరిగేలా చూస్తామనడంతో ఆందోళన విరమించారు.

పలువురిపై కేసు..

రోడ్డుపై ధర్నా చేశారని కుమిరిశెట్టి మహేందర్, మెండే సుమన్, అలివేలి మురళి, శనిగరపు ముత్తయ్య, అలివేలి లక్ష్మ య్య, దండవేని మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

దాడికి గురైన కాంగ్రెస్ నాయకుడి మృతి

- చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృత్యుఒడికి..
- పథకం ప్రకారమే చేశారన్న మృతుడి సోదరుడు
- ఆస్పత్రి వద్ద పోలీసులపైనా నిందితుల దాడి
- మాజీ సర్పంచ్ సహా ఆరుగురిపై కేసు
- ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు : విప్ 'అడ్లూరి'


నరేశ్ (ఫైల్)


పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని కటికెనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి రేండ్ల నరేశ్(40) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయనపై దాడి చేసి, మృతికి కారణమైన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నరేశ్ సోదరుడు సతీశ్ కథనం ప్రకారం.. రేండ్ల నరేశ్ కటికెనపల్లిలో గత ఐదేళ్లలో సిమెంట్ రోడ్ల అభివృద్ధి పనుల్లో జరిగిన నిధులు దుర్వినియోగంపై ఆర్టీఐకి దరఖాస్తు చేశాడు. పనుల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, చామనపల్లి భూ విషయంలో అతని ప్రోత్సాహంతోనే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని మాజీ సర్పంచ్ కారుపాకల రాజయ్య అనుమానించాడు. నరేశ్‌ను ఎలాగైనా చంపాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తనకు ఆరోగ్యం బాగా లేదని చెప్పి, రాజయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరాడు. అంతకుముందే నరేశ్‌ను చంపాలని, ఏదైనా తాను చూసుకుంటానని తన కుమారులు కారుపాకల కుమార్, వెంకటేశ్‌లతోపాటు బోనగిరి శ్రీనివాస్, పాటకుల బుచ్చి రాములు, జంగిలి చిన్న రవిలకు చెప్పాడు. దీంతో వారు ఆదివారం ఎండపల్లి మండలంలోని రాజా రాంపల్లి వైన్స్‌లో మద్యం సేవించారు. వెంకటేశ్ అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్‌లో ఉన్న తండ్రి వద్దకు వెళ్లాడు. అదేరోజు రాత్రి బుచ్చిరాములు, చిన్న రవి రేండ్ల నరేశ్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించగా కుమార్, శ్రీనివాస్ బైక్‌పై అతను కొత్తగా నిర్మిస్తున్న ఇంటి సమీపంలో ఉంటున్న గది వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లి నరేశ్‌పై పారలతో విచక్షణారహితంగా దాడి చేశారు. అతను చనిపోయాడని భావించి, అక్కడి నుంచి బుచ్చిరాములు ఇంటికి వెళ్లారు. నరేశ్‌ను కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి చనిపోయాడు. మృతుడి తమ్ముడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజయ్య, కుమార్, వెంకటేశ్, బుచ్చిరాములు, చిన్న రవి, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

పాడె మోసిన ప్రభుత్వ విప్..

నరేశ్ మృతదేహం సోమవారం కటికెనపల్లికి చేరింది. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుమారుడు రాంచందర్‌రెడ్డి వచ్చి, నివాళి అర్పించారు. అనంతరం భారీగా తరలివచ్చిన గ్రామస్తులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. విప్ లక్ష్మణ్‌కుమార్ పాడె మోశారు. మాజీ ఎంపీపీ కొడారి అంజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రూప్లానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్ కాడె సూర్యనారాయణ తదితరులున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా..

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నరేశ్‌పై పలుమార్లు దాడులు జరిగాయని, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విప్ లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ప్రత్యర్థులతో ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పోలీసుల అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా గాడితప్పిందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

ఆస్పత్రి ఎదుట ఉద్రిక్తత


ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

కరీంనగర్‌క్రైం: రేండ్ల నరేశ్‌ను తీసుకెళ్లిన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఆదివారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. స్థానిక సుభాష్‌నగర్‌కు చెందిన కొందరు యువకులు దవాఖానా వద్దకు రావడంతో ఘర్షణ వాతవరణం ఏర్పడింది. వీరు హత్య కేసులో ఉన్న ఒకరికి బంధువులు అని తెలిసింది. అక్కడే ఉన్న ధర్మారం ఎస్సై సత్యనారాయణ ఇరువర్గాల మధ్య గొడవ జరుగుతుందని భావించి, వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే, వారు వినలేదని, విధుల్లో ఉన్న తమపై దాడి చేశారని కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి వద్ద ఘటనను కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారన్నారు.

బావిలో పడిన శునకాన్ని రక్షించారు..


కుక్కను పైకి తీసుకొస్తున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌రూరల్: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన వీధికుక్కను అగ్ని మాపక సిబ్బంది రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని ఓ వ్యవసాయ బావిలో నాలుగు రోజుల క్రితం ఓ శునకం పడిపోయింది. ఆహారం, నీరు లేక ఆకలితో అల్లాడుతోంది. సోమవారం దాని అరుపులు విన్న స్థానికులు స్త్రే యానిమల్ ఫౌండేషన్ ప్రతినిధి గౌతం, శ్రీలక్ష్మి జంతుసంరక్షణ ప్రతినిధి ఆసిరి సుమన్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకొని, అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు. వారు వచ్చి, బావిలోకి నిచ్చెన ద్వారా దిగి, కుక్కను వలలో బంధించి బయటకు తీసుకొచ్చారు. ప్రస్తుతం దాని ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉంది. ప్రాణాపాయస్థితిలో ఉన్న శునకాన్ని కాపాడినందుకు జంతుప్రేమికులు వారిని అభినందించారు.

వలస కార్మికుడి మృతిపై విచారణ


ఆధారాల కోసం చూస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంలో వలస కార్మికుడు నాయక్ రసూల్(36) ఆదివారం ఉదయం మృతిచెందిన విషయం విదితమే. అతని మృతిపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సోమవారం విచారణ చేపట్టారు. బంగ్లాపై మృతదేహం గుర్తించిన చోట రక్తపు మరకలు ఉండటం, బలమైన వస్తువుతో తలపై బాదడంతో చెవుల్లో నుంచి రక్తం వచ్చి చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. భవన యజమాని పుట్టయ్య కుటుంబసభ్యులను ఏవైనా శబ్దాలు వినిపించాయా అని అడిగారు. ఆధారాల కోసం బిల్డింగ్ చుట్టుపక్కల ప్రాంతాలను గంటకు పై గా పరిశీలించారు. రెండు, మూడు చోట్ల రక్తపు మరకలు ఉన్న ట్లు గుర్తించారు. ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో వెనుదిరిగారు. బంగ్లాపై అక్కడక్కడ రక్తపు మరకలను తుడిచి, నీటితో కడిగేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతుడి బంధువులపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారణ జరిపినట్లు సమాచారం.

చెట్టు కొమ్మ పడి వృద్ధుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని మంచిరామికి చెందిన బొత్కూరి చంద్రయ్య(60) చెట్టు కొమ్మ పడటంతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. చంద్రయ్య సోమవారం తన ఇంటి సమీపంలోని చెట్టును నరికేస్తున్నాడు. ఈ క్రమంలో కొమ్మను తాడుతో లాగుతుండగా ఒక్కసారిగా విరిగి, అతని మీద పడింది. అక్కడున్నవారు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య అమృతమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కత్తితో దాడి.. ముగ్గురికి గాయాలు


గాయపడిన మొయినొద్దీన్

కోరుట్ల: అద్దె కుటుంబాల మధ్య బాత్‌రూం శుభ్రం చేసే విషయంలో జరిగిన గొడవ కత్తితో దాడి చేసేవరకు వెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ముగ్గురిపై కత్తిపోట్లకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణానికి చెందిన అజార్ పాషా, మహారాష్ట్రకు చెందిన సఫి–సరయ దంపతులు పట్టణంలోని హాజీపురలో గల ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో అద్దెకు ఉంటున్నారు. అజార్ పాషా పాత సామగ్రి కొనుగోలు వ్యాపారం చేస్తుండగా సఫి ప్రైవేట్ పనులు చేస్తుంటాడు. కాగా, సోమవారం బాత్‌రూం శుభ్రం చేసే విషయంలో రెండు కుటుంబాలవారు గొడవ పడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన అజార్ పాషా తన వద్ద ఉన్న కత్తితో సఫిపై దాడికి యత్నించాడు. సఫి మామయ్య సయ్యద్ మొయినొద్దీన్, కూతురు సనాపై, అదే దారిలో వెళ్తున్న గోదావరి అనే మహిళ అడ్డురావడంతో ఆమెపైనా దాడి చేశాడు. మొయినొద్దీన్, సనాకు తీవ్ర, గోదావరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులకు కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. మొయినొద్దీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సఫి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

అప్పుల బాధతో మహిళ..


లక్ష్మి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అప్పులు చేసి, గల్ఫ్ వెళ్లిన భర్త అక్కడ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఇంటికి వచ్చాడు.. దీంతో అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్తాపానికి గురైన అతని భార్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన బొదాసు లక్ష్మి(42) గ్రామంలో కూలీ పనులకు వెళ్తోంది. ఆమె భర్త నర్సయ్య 8 నెలల క్రితం అప్పులు చేసి, ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అక్కడి కంపెనీలో పని సరిగా దొరకలేదు. ఈ క్రమంలోనే రెండు నెలల క్రితం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని నడుము, కాలు విరగడంతో స్వగ్రామం తిరిగొచ్చాడు. భర్త డబ్బులు సంపాదించుకు రాలేదని, అప్పులు ఎలా తీర్చేదని లక్ష్మి మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలికి కుమారుడు నాని, కూతురు చిన్ని ఉన్నారు. భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ కోరారు.

పడకల్‌వాసి..

వెల్గటూర్ (ధర్మపురి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పడకల్‌కు చెందిన వడకాపురం శ్రీనివాస్(44) గతంలో ప్రైవేటు ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఇందుకోసం చేసి అప్పు సమయానికి తీర్చలేకపోయాడు. మార్గం కనిపించకపోవడంతో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. సోమవారం గ్రామ శివారులోని ఒర్రె గడ్డపై కరెంట్ వైరుతో చెట్టుకు ఉరేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు మృతదేహాన్ని చూసి, పోలీసులకు సమాచారం అందించారు. వారు శ్రీనివాస్‌గా గుర్తించి, కుటుంబసభ్యులకు తెలిపారు. అప్పుల బాధ భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య శ్యామల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

భర్త మాట్లాడటం లేదని భార్య..


మమత (ఫైల్)

గన్నేరువరం(హుస్నాబాద్): భర్త మాట్లాడటం లేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన టేకు జోగయ్యకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కూతురు మమత(27)కు గ్రామానికే చెందిన పత్తి దుర్గాప్రసాద్‌తో వివాహం జరిపించారు. ఈ దంపతులకు పదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో జీవనోపాధి కోసం దుర్గాప్రసాద్ రెండు నెలల క్రితం ఝార్ఖండ్ వెళ్లాడు. వెళ్లినప్పటి నుంచి తనతో మాట్లాడటం లేదని, ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని మమత మనస్తాపానికి గురైంది. సోమవారం ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి తండ్రి జోగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.

వీర్నపల్లి మండలంలో బాలిక..

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తండ్రి సోమవారం ఉదయాన్నే మేకలను మేపేందుకు అడవికి, తల్లి ఉపాధిహామీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని, ఇంటికి వచ్చి చూడగా వారి కూతురు దూలానికి ఉరేసుకొని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాలుగేళ్లుగా మంచంపట్టి.. మృత్యుఒడికి

- అనారోగ్యంతో పవర్‌లూమ్ కార్మికుడి మృతి
- ఇద్దరు ఆడపిల్లలు సంతానం
- మొదటి కూతురి ఇద్దరు ఆడపిల్లల బాధ్యత ఈ కుటుంబానిదే..
- చివరకు చందాల ద్వారా అంత్యక్రియలు


భర్త శ్రీనివాస్ మృతదేహంపై పడి రోదిస్తున్న పద్మ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఆయన పవర్‌లూమ్ కార్మికుడు.. ఈ పని చేస్తూనే భార్య, ఇద్దరు కూతుళ్లను పోషించాడు.. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మంచం పట్టాడు.. పెద్ద కూతురు ఆత్మహత్య చేసుకుంది. అల్లుడు వదిలేయడంతో వారి ఇద్దరు ఆడపిల్లల బాధ్యత ఈ కుటుంబానిదే.. ఈ పరిస్థితుల్లో విధి ఆ కుటుంబాన్ని వెక్కిరించింది. పని చేయకున్నా ఇంటి పెద్ద ఉన్నాడన్న వారి ధైర్యాన్ని దూరం చేస్తూ ఆయనను తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కూచన శ్రీనివాస్(55) పవర్లూమ్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ నాలుగేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఆయనకు భార్య పద్మ, కూతుళ్లు శిరీష, సాయిలత ఉన్నారు. పెద్ద కూతురికి పెళ్లి చేయగా ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. ఆమె గతంలో ఆత్మహత్య చేసుకుంది. అల్లుడు ఇద్దరు పిల్లలను వదిలేయడంతో వీరి వద్దే పెరుగుతున్నారు. ప్రస్తుతం పెద్ద పాప మూడోతరగతి, చిన్న పాప రెండో తరగతి స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు.

కుటుంబానిది దీనస్థితి..

శ్రీనివాస్ భార్య పద్మ ఎవరి ఇళ్లలోనైనా మంచం పట్టిన వృద్ధులుంటే వారికి సేవలందిస్తూ అలా వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది. చిన్న కూతురు సాయిలత అమ్మకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు బీడీలు చుడుతోంది. శ్రీనివాస్‌కు కావాల్సిన మందులు తెస్తూ, ఇద్దరు చిన్నపిల్లల ఆలనాపాలన చూస్తున్న వీరికి పెద్ద కష్టం వచ్చింది. మృత్యువుతో పోరాడుతున్న ఇంటి పెద్ద శ్రీనివాస్ సోమవారం మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

చందాలతో దహన సంస్కారాలు

నిరుపేద కుటుంబం కావడంతో శ్రీనివాస్‌కు దహన సంస్కారాలు చేసేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబసభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గ్రామస్తులే తలాకొంత పోగేయడంతో రూ.10 వేలు జమయ్యాయి. దీంతో రాత్రి అంత్యక్రియలు పూర్తి చేశారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.